నమస్తే తెలంగాణ
వికారాబాద్
I హైదరాబాద్, మంగళవారం 17 జూన్ 2025 VIKARABAD

పోటెత్తిన అభిమానం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫార్ములా ఈ-కారు రేసింగ్ కేసులో ఏసీబీ విచారణకు హాజరైన సందర్భంగా బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌కు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పోటెత్తారు. పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు అక్కడికి తరలిరావడంతో విపరీతమైన రద్దీ ఏర్పడింది. వరదలా వస్తున్న బీఆర్ఎస్ నేతలతో భవన్ పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి. ఉదయం 9.30 ప్రాంతంలో నందినగర్ నివాసం నుంచి బయలుదేరిన కేటీఆర్ తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అక్కడ పార్టీ నేతలు, కార్యకర్తలను కలిసి ఉదయం 10 గంటలకు బంజారాహిల్స్ రోడ్ నం-12లోని ఏసీబీ కార్యాలయానికి వెళ్లారు. విచారణ అనంతరం కేటీఆర్ నందినగర్‌లో నివాసానికి చేరుకోగా అక్కడ ఆయనకు దిష్టితీసి లోపలికి స్వాగతం పలికారు. -బంజారాహిల్స్, జూన్ 16

రెండు రోజులు వర్ష సూచన

సిటీబ్యూరో, జూన్ 16 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నగర వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. అంతే కాకుండా సోమవారం రాత్రి నగరంలోని పలు చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. ఆవర్తన ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 31.4, కనిష్ఠం 22.6 డిగ్రీలు, గాలిలో తేమ 59 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

పంటలను సాగు చేస్తున్నా అందని ప్రభుత్వ సాయం

- గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో లేని నిబంధన.. ఇప్పుడెందుకు..?
- రేవంత్ సర్కార్‌ను ప్రశ్నిస్తున్న ఔటర్‌రింగ్‌రోడ్డు పరిసర గ్రామాల రైతులు
- కొన్నేండ్లుగా సాగు చేసుకుంటున్న భూములను బ్లాక్ లిస్ట్‌లో పెట్టడంతో మండిపాటు
- గత సర్కార్ ఇచ్చినట్లుగానే ఇవ్వాలని డిమాండ్

మాకేదీ భరోసా..?

రంగారెడ్డి, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : ఔటర్‌రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) కు లోపల, బయట ఉన్న పలు గ్రామాల్లోని రైతులకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుభరోసా అందకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మేము చేసిన పాపం ఏమిటి.. మాకెందుకు రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయడంలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఓఆర్ఆర్ పరిధిలోని పెద్దఅంబర్‌పేట, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, తుక్కుగూడ, శంషాబాద్, రాజేంద్రనగర్, శంకర్‌పల్లి తదితర మండలాలు, మున్సిపాలిటీల్లో ఉన్న భూములను అధికారులు సాగుకు యోగ్యం కాని భూముల కింద రికార్డుల్లో చేరడంతో సంబంధిత రైతులకు రైతుభరోసా అందడం లేదు. తాము ఆ భూముల్లో కొన్నేండ్లుగా పంటలను సాగు చేసుకుని జీవిస్తున్నామని.. ఆ పొలాలను సాగుకు యోగ్యం కాని భూములుగా అధికారులు రికార్డుల్లోకి ఎక్కించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఆ సర్వేనంబర్‌లో ఉన్న మొత్తం భూమిని భూమిలో ఒక ప్లాటున్నా ఆ సర్వేనంబర్‌లోని ఎకరం ప్లాట్ల కింద రాయడంతో మిగతా తొమ్మిది ఎకరాల రైతులకు కూడా రైతుభరోసా అందడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో సగం మందికి కూడా రాని రైతుభరోసా..

వివిధ కారణాలను చూపించి జిల్లాలోని సగం మంది రైతులకు రైతుభరోసా అందకుండా అధికారులు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్లాట్లు, సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించే ప్రక్రియను ప్రారంభించారు. ఆ ప్రక్రియలో భాగంగా ఓఆర్ఆర్ పరిసర ప్రాంతాల్లోని సుమారు 50 నుంచి 60 గ్రామాల వరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోకి వస్తున్నాయని భావించి రైతుభరోసాను నిలిపివేశారు.

జిల్లాలో అర్హులు 3,24,000 మంది..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే జిల్లాలో రైతుభరోసాకు 3,24,000 మంది అర్హులుగా అధికారులు గుర్తించారు. వారికి సీజన్‌లో సుమారు రూ.300 కోట్లకు పైగా రైతుబంధు చెల్లించాల్సి ఉంటుందని అంచనా వే శారు. గ్రేటర్ పరిధిలోని పలు మండలాలకు పూర్తిగా రైతుభరోసాను నిలిపేశారు. అలాగే, ఓఆర్ఆర్ పరిసర ప్రాంతాల్లో ఉన్న మండలాలు, మున్సిపాలిటీల్లోని సర్వేనంబర్లను యూనిట్‌గా చేసుకుని భరోసాను నిలిపివేయడంతో అర్హులైన వందలాది మంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తాము అర్హులమని.. రైతుభరోసా ఇవ్వాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదని వాపోతున్నారు.

పదివేల మందికిపైగానే.. అందని పెట్టుబడి సాయం

ఔటర్ రింగ్‌రోడ్డు పరిసరాల్లోని మండలాలు, మున్సిపాలిటీల్లో పలు గ్రామాల్లో సుమారు పది నుంచి పదిహేను వేల మంది అర్హులైన రైతులు న్నా వారికి రైతుభరోసా అందడం లేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సాగుకు యోగ్యం కాని భూముల పేరుతో అధికారులు తప్పుడు సర్వే చేసి రికార్డుల్లో ఎంట్రీ చేశారని మండిపడుతున్నారు. వారు నేటికీ వరి, కూరగాయల పంటలను సాగు చేసుకుని జీవిస్తున్నారు. అధికారులు మరో సారి సర్వే చేసి.. తమ భూములకు రైతుభరోసా ఇప్పించాలని కోరుతున్నారు.



అర్హులకు రైతు భరోసా చెల్లించాలి..

ఔటర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో నేటికీ వ్యవసాయం చేసుకుని ఎంతో మంది జీవిస్తున్నారు. వారందరికీ రైతుభరోసా చెల్లించాలి. వారి పొలాలను సాగుకు యోగ్యం కాని భూములుగా అధికారులు రికార్డుల్లో ఎక్కించడం చాలా దారుణం. గత కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయానికి అనుకూలంగా ఉన్న ప్రతి ఎకరాకు రైతుబంధు చెల్లించింది. ఆ సర్కార్ మాదిరిగా.. రేవంత్ ప్రభుత్వం కూడా అర్హులందరికీ రైతుభరోసా చెల్లించి ఆదుకోవాలి.

-మొద్దు అంజిరెడ్డి, ఉత్తమరైతు

- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- ఆసుపత్రులకు క్యూ కట్టిన ప్రజలు
- వికారాబాద్ జిల్లాలోని గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా కనిపిస్తున్న పరిసరాలు
- పెరుగుతున్న దోమల వ్యాప్తి..
- ముందస్తు జాగ్రత్తలు చేపట్టని అధికారులు

పారిశుధ్యం కరువై.. అనారోగ్యం చేరువై..

వికారాబాద్ ప్రభుత్వ దవాఖాన వద్ద ఓపీ కోసం నిరీక్షిస్తున్న రోగులు

వికారాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : సీజనల్ వ్యాధులపై జిల్లా వైద్యారోగ్య శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. వానకాలం ప్రారంభం కావడంతో డెంగీ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశమున్న దృష్ట్యా వాటి నివారణకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో పలు గ్రామాల్లోని ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీలు ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీల నిర్వహణకు నయా పైసా కూడా కేటాయించకపోవడంతో పల్లెల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిపోయింది. మరోవైపు వర్షాలు కురుస్తుండడంతో ఆ నీరు నిల్వ ఉండడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం తదితర కారణాలతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా, కలరా తదితర వ్యాధులు వ్యాపించే అవకాశాలున్నాయి. గతంలో జిల్లాలో డెంగీ కేసులు నమోదైన దృష్ట్యా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పరిగి : తుంకులగడ్డ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో దోమలకు నిలయంగా మారిన మురుగునీటి ప్రవాహం

వైద్యారోగ్య శాఖ నిర్లక్ష్యం..

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లాలో అవగాహన కార్యక్రమాలు, వ్యాధుల నివారణకు అవసరమైన చర్యలను వైద్యారోగ్య శాఖ అధికారులు తీసుకోలేదు. సీజనల్ కేసుల నమోదు పెరిగినట్లయితే జిల్లావ్యాప్తం గా ఫీవర్ సర్వే నిర్వహించి వ్యాధి లక్షణాలను ప్రారంభంలోనే గుర్తించి చికిత్స అందించేందుకు చర్యలు చేపడుతారు కానీ ఇప్పటివరకు అలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. అంతేకాకుండా ప్రతి ఏటా డెంగీ తో చాలా మంది మృతిచెందుతున్న దృష్ట్యా జిల్లాలోని అన్ని ఆసుపత్రుల్లోనూ డెంగీ వ్యాధుల చికిత్సకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచేందుకు ఎలాంటి ప్రణాళిక లేకపోవడం గమనార్హం. అయితే వాతావరణం చల్లబడడంతోపాటు ఓ మోస్తరు నుంచి ముసురు కురుస్తున్నది. దీంతో సీజనల్ వ్యాధులూ ప్రబలే అవకాశాలున్నాయి. అయితే ఇప్పటికే చలి, జ్వరాలతో ఆసుపత్రులకు క్యూ కడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నది. వానలు పడుతుండడంతో నీటి కాలుష్యం పెరగడంతోపాటు డ్రైనేజీ నీరు తాగునీటి పైపుల్లోకి చేరి డయేరియా, కామెర్లు తదితర వ్యాధులు వచ్చే అవకాశమున్నది. మురుగు నీరు ఉండడంతో దోమలు కూడా వ్యాప్తి చెందుతాయి. వాటితో డెంగీ, మలేరియా బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం..

గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిపోయింది. బీఆర్ఎస్ హయాంలో స్వచ్ఛ పంచాయతీలుగా మారిన పలు గ్రామాల్లో ప్రస్తుతం ఎక్కడ చూసినా మురుగునీటి ప్రవాహం, చెత్తాచెదారమే దర్శనమిస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వంలో పల్లెలు చాలా శుభ్రంగా ఉండేవి. అయితే, పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు ఏడాదికిపైగా ప్రస్తుత రేవంత్ సర్కార్ జీతాలు చెల్లించకపోవడంతో వారు పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ చూపడం లేదు. మరోవైపు గ్రామాల్లో డ్రైనేజీ పైప్‌లైన్ల లీకేజీలకు మరమ్మతులు చేయకపోవడంతో డ్రైనేజీ వ్యర్థాలతో రోడ్లన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి.

నవాబుపేట: రోడ్డుపై పారుతున్న మురుగు

భారంగా బడి ఫీజు..

ప్రైవేట్ పాఠశాలల్లో ఇష్టానుసారంగా వసూళ్లు..

ఇబ్రహీంపట్నం, జూన్ 16 : తమ పిల్లలు ఇంగ్లిష్ మీడియం స్కూళ్లలో చదివితే భవిష్యత్ బాగుంటుందనే ఆలోచనతో తల్లిదండ్రులు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలను ఆశ్రయిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. ఒకటి నుంచి పదోతరగతి వరకు రూ. 40,000 నుంచి రూ. 80,000 వరకు దండుకుంటున్నారనే ఆరో పణలున్నాయి. సర్కారు పాఠశాలల్లోనే పిల్లలను చదివించాలంటూ ఓ వైపు ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా.. మరోవైపు కొత్త సిలబస్, ఫౌండేషన్ కో ర్సులు అంటూ ఆకర్షణీయమైన కరపత్రాలు ముద్రించి ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ప్రచారం చేస్తున్నాయి. ప్రైవేట్‌లో తమ పిల్లలను చేర్పిస్తున్న పేద, మధ్యతరగతి వారికి అధిక ఫీజులు చెల్లించడం భారంగా మారిందని పలువురు వాపోతున్నారు.

అన్నీ తమ వద్దే కొనాలని..

నోట్ పుస్తకాల దగ్గర నుంచి యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, షూ, బెల్టు, పెన్ను, పెన్సిల్, వాటర్‌బాటిళ్లు ఇతరత్రా అన్ని రకాల సామగ్రిని తమ పాఠశాలల్లోనే కొనాలని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పిల్లల తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తున్నాయి. దీంతో చిన్నపాటి ఉద్యోగం చేసుకునే వారికి బడి ఫీజులు చెల్లించడం భారంగా మారింది. దీంతో కొంత మంది అప్పులు చేసి మరీ చదివిస్తున్నారు.

ఇరుకు గదుల్లోనే..

విద్యార్థులు చదువుకునే పాఠశాల గదుల్లో

- ఎల్‌కేజీకి రూ.40 వేల పైమాటే..
- టెన్త్‌కు రూ.40,000-రూ.80,000వరకు..
- పుస్తకాల నుంచి పెన్సిళ్ల వరకు స్కూళ్లలోనే అమ్మకాలు
- కనీస వసతులు.. క్రీడా మైదానాలు కరువు..
- పట్టించుకోని విద్యాశాఖ

వెలుతురు, గాలితోపాటు శుభ్రత ఉండాలి. జిల్లాలో చాలావరకు ప్రైవేట్ పాఠశాలలు ఇరుకు గదుల్లోనే కొనసాగుతున్నాయి. వెలుతురు లేకపోగా ఫ్యాన్లు కూడా సక్రమంగా లేని పరిస్థితి నెలకొన్నది. కొందరు శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేయగా, మరికొందరు పట్టణం మధ్యలోనే ప్రైవేట్ భవనాలను అద్దె కు తీసుకుని స్కూళ్లను కొనసాగిస్తున్నారు. ఫైర్‌సేఫ్టీ, ప్లేగ్రౌండ్స్ ఇతర వసతులు ఏమీ ఉండకున్నా విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇబ్రహీంపట్నం, తుర్కయాంజాల్, యాచారం, మంచాల, అబ్దుల్లాపూర్‌మెట్, ఆదిబట్ల, పెద్దఅంబర్‌పేట్‌తో పాటు పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ప్రైవేట్ పాఠశాలలు ఎలాంటి వస తులు లేని గదుల్లో కొనసాగుతున్నాయి.

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

పేద విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై నిఘా పెంచాలి. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, యూనిఫామ్, షూ, టై, బెల్టులతోపాటు విద్యార్థులకు అవసరమైన సామగ్రిని విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి. -రాజ్‌కుమార్, బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి

ఫీజులను నియంత్రించాలి

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు యూనిఫామ్స్, బుక్స్, ఐడీకార్డుల పేరుతో విద్యార్థుల నుంచి అదనంగా వసూలు చేస్తున్నాయి. అధికారులు స్పందించి అధిక ఫీజులను నియంత్రించాలి. -మైలారం విజయ్‌కుమార్, విద్యార్థి సంఘాల నాయకుడు

క్రీడా ప్రాంగణం కబ్జాకు యత్నం..

అడ్డుకున్న స్థానికులు

మండలంలోని తోలుకట్టా సర్వేనంబర్ 134లో గత కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి.. దానికోసం రెండెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించింది. ఆ ప్రాంగణాన్ని ఆనుకునే నగరానికి చెందిన మిర్జాబేగ్ అనే రియల్ వ్యాపారి కొంత భూమిని కొన్ని వెంచర్‌ను ఏర్పాటు చేసి.. అందులోని ప్లాట్లను విక్రయిస్తున్నాడు. అంతేకాకుండా తెలంగాణ క్రీడా ప్రాంగణానికి సంబంధించిన భూమిలో అర ఎకరం కబ్జా చేసేందుకు గత రెండు నెలలుగా యత్నిస్తుండగా.. స్థానికులు ప్రతిసారీ అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలోనే సోమవారం కూడా క్రీడా ప్రాంగణం స్థలాన్ని చెర పట్టేందుకు యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నిస్తున్న రియల్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కోరారు. -మొయినాబాద్, జూన్16

ఓఆర్ఆర్ బాధితుల నిరసన

సిటీబ్యూరో: ఓఆర్ఆర్ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు పరిహారంగా అప్పట్లో హెచ్ఎండీఏ సమీపంలోనే భూసేకరణ చేసి.. ప్లాట్ల అభివృద్ధి కోసం పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించారు. రైతులు, నిర్మాణదారులకు 70+30 విధానంలో ఘట్‌కేసర్ సమీపంలోని కొండాపూర్ వద్ద 100 ఎకరాల విస్తీర్ణంలో భూములను కేటాయించి, ప్లాట్లుగా అప్పగించారు. అయితే ఆ వెంచర్‌లో కాంట్రాక్టర్ ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదు. సుమారు 15 ఏండ్ల తర్వాత హెచ్ఎండీఏ అధికారులు మౌలిక వసతులు కల్పించని సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోకుండా.. తమను వేధింపులకు గురిచేస్తున్నారంటూ.. అమీర్‌పేట్‌లోని హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయానికి బాధితులు చేరుకున్నారు. కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసిన అనంతరం వినతిపత్రాన్ని అధికారులకు అందజేసినట్లు ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ బాధితుల సంఘం సభ్యులు పేర్కొన్నారు.